ప్రజాశక్తి
సోమవారం 12 ఫిబ్రవరి 2024
5
కర్నూలు

# ఒపిఎస్‌ను సాధించి తీరతాం

## - పోరాటాలకు పుట్టినిల్లు యుటిఎఫ్ - రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు
## - ఘనంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు ప్రారంభం

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

యాభై ఏళ్ళ చరిత్ర కలిగిన యుటిఎఫ్ పోరాటాలకు పుట్టినిల్లని, ఉద్యమాలతో ప్రభుత్వం మెడలు వంచి ఉపాధ్యాయుల ప్రతి హక్కులను కాపాడి, ఒపిఎస్‌ను సాధించుకుంటామని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. యుటిఎఫ్‌లో ఉద్యమంలో అమరులయిన కుటుంబాలకు సంఘం అండగా నిలుస్తుందని అన్నారు. పాత పెన్షన్ విధానం సాధించి తీరుతామని సిపిఎస్ రద్దయ్యేవరకు పోరాటం దశల వారీగా చేస్తూనే ఉంటామన్నారు. ఆదివారం కర్నూలు సిల్వర్ జూబిలీ కళాశాలలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ నగారా, డప్పుల కొట్టి సంబరాలను ప్రారంభించారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవ లోగోను నాయకులు ఆవిష్కరించారు. సభాధ్యక్షులుగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యుఆర్ఎ. రవికుమార్ వ్యవహరించారు. సభ ప్రారంభానికి ముందు యుటిఎఫ్ పతాకాన్ని రాష్ట్ర సహాధ్యక్షులు కందుకూరి సురేష్ కుమార్, ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని నక్కావెంకటేశ్వర్లు ఆవిష్కరించి, అక్కడే ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ప్రారంభ సభలో యుటిఎఫ్ జిల్లా తొలి ప్రధానకార్యదర్శి రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య మాట్లాడుతూ అంకితత్వం, ఉద్యమ స్ఫూర్తి ఒక్క యుటిఎఫ్‌కే సాధ్యమన్నారు. పోరాటాలతోనే ఉపాధ్యాయుల ప్రయోజనాలు సాధించుకుంటామని చెప్పారు. ప్రతి కార్యకర్త యుటిఎఫ్ కుటుంబ సభ్యుడన్న విషయాన్ని నాయకత్వం మరచిపోదని తెలిపారు. ఆనాటి నుండి ఈనాటి వరకు అదే ఒరవడి కొనసాగుతున్నదన్నారు. రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్‌కుమార్ మాట్లాడుతూ యుటిఎఫ్ అంటేనే పోరాటాల చరిత్ర అని ఉపాధ్యాయ ఉద్యమ చరిత్రలో సరికొత్త అధ్యాయం రాస్తుందన్నారు. ఈ సంబరాలు ఏడాదంతా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతాయన్నారు. యుటిఎఫ్ మాజీ రాష్ట్రగౌరవాధ్యక్షులు నరసింహులు మాట్లాడుతూ అనేక ఉద్యమాలు నిర్మించి ఉద్యోగ ప్రయోజనాలు సాధించి పెట్టిన సంఘంగా ఘనచరిత్ర కలిగిన సంఘమైన యుటిపఫ్ కోసం చివరి శ్వాస వరకు శ్రమిస్తానన్నారు. కోడుమూరు మాజీ ఎంఇఒ నాగభూషణం శెట్టి యుటిఎఫ్ సుదీర్ఘ ఉద్యమ చరిత్రను పద్యంలో వివరించారు. సభలో కెంగార మోహన్ రచించిన యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల గేయాన్ని ప్రజనాట్యమండలి సీనియర్ నాయకులు ఎంపి బసవరాజు ఆలపించారు. గతంలో నాయకత్వ బాధ్యతలు నిర్వర్తించిన వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి నవీన్‌పాటి స్వాగతం పలుకగా సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, యుటిఎఫ్ రాష్ట్రనాయకులు నాగమణి, జయరాజు, ఎల్లప్ప, నంద్యాల జిల్లా కార్యదర్శి సుధాకర్, సిఐటియు నాయకులు రామాంజనేయులు, జెవివి నాయకులు సుధీర్ రాజు, జిల్లా ఆర్థిక కార్యదర్శి యెహోషువా తదితరులు సందేశం ఇచ్చారు.

యుటిఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి పుల్లయ్యను సన్మానిస్తున్న నాయకులు

ఎస్‌టిఎఫ్ఐ, యుటిఎఫ్ పతాకాలను ఎగురవేస్తున్న నాయకులు నక్కా వెంకటేశ్వర్లు, కె.సురేష్‌కుమార్

# ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

**- సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ అధ్యక్షులు భవానీ ప్రసాద్**

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

ఓటుతోనే సమాజ మార్పు అని, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ అధ్యక్షులు, మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.భవానీ ప్రసాద్ తెలిపారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలులోని త్రిగుణ ఇన్ హోటల్‌లో ఓటు వేద్దాం – ప్రజాస్వామ్య పరిరక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భవానీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం ఉండాల్సిన స్థితిలో లేదన్నారు. రాను రాను నైతికంగా పతనం అవుతోందన్నారు. ఆ సమస్యకు పరిష్కారం ఏమిటనేది ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. ఎన్నుకోవాల్సిన వారిని ఎన్నుకోకపోతే మన భవిష్యత్తు ప్రశ్నార్థకంగా తయారవుతుందన్నారు. సరైన వారిని ఎన్నుకోకపోవడం వల్ల అత్యధిక మంది ప్రజలు బాధను అనుభవిస్తున్నారన్నారు. డబ్బు, మద్యం కోసం ఓటు వేసే పరిస్థితిని మార్చగలిగితే సమాజం ముందుకు వెళుతుందని తెలిపారు. ఎన్నికలు మన కోసం మనం చేయాల్సిన యజ్ఞం అని ప్రజలకు తెలియజేయగలిగితే బాగుంటుందన్నారు. మనలను మనం సగర్వంగా నిలబెట్టుకోవడానికి, పిల్లల భవిష్యత్తు బాగుండటానికి, దేశం నైతికంగా ఉండటానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కార్యదర్శి, ఎపి మాజీ ఎన్నికల ప్రధానాధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ మాట్లాడుతూ ఎపిలో ఒక నిశబ్ద విప్లవం ఆరంభమైందని, బెదిరింపులకు లొంగకుండా ఓటు వేసే పరిస్థితి వస్తుందని తెలిపారు. ప్రజాభిప్రాయంతో ఏర్పడిన ప్రభుత్వానికే విలువ ఉంటుందని సుప్రీం కోర్టు చెప్పిందని, ఓటును ప్రాథమిక హక్కుగా పరిగణించాలని చెప్పిందని తెలిపారు. పౌరుల్లో సామాజిక బాధ్యతను గుర్తు చేయడానికే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. తిరుపతి ఉప ఎన్నికల్లో అక్రమాలకు సంబంధించి ముందుగా చర్యలు తీసుకుని ఉంటే కనువిప్పు కలిగేదన్నారు. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ విచక్షణతో ఓటు వేయాలని కోరారు. ఓటర్ల జాబితాలో లోటుపాట్లను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఉపాధ్యక్షులు, మాజీ ముఖ్య కార్యదర్శి ఎల్‌వి.సుబ్రమణ్యం మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికిన నాయకులు ఎన్నికల తరువాత ప్రజల గురించి పట్టించుకోవడం లేదన్నారు. దోచుకోవడంపై ఉన్న దృష్టి ప్రజలకు ఇచ్చిన హామీలపై లేదన్నారు. ప్రజల్లో చైతన్యం ఉంటే సరిపోదని, ప్రజాప్రతినిధుల్లోనూ చైతన్యం తేవాలన్నారు. బాధ్యత గురించి ప్రజాప్రతినిధులు మరచిపోతున్నారన్నారు. ప్రజాప్రతినిధులు గౌరవాన్ని నిలబెట్టుకోవాలని, అప్పుడే సుస్థిరమైన సమాజాన్ని నిర్మించగలమని తెలిపారు. ఒక చట్టం తెస్తే వచ్చే నష్టాలు మంత్రులకు తెలియాలని, ప్రస్తుతం అలా జరగడం లేదని చెప్పారు. ప్రజల్లో నిరాసక్తి వల్ల సమాజం దౌర్భాగ్య స్థితికి పోతోందని, అది క్షేమకరం కాదని తెలిపారు. అనంతరం 'ఓటు వేద్దాం' కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో లెట్స్ ఓట్ సంస్థ జాతీయ కన్వీనర్ సుబ్బరంగయ్య, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కోశాధికారి పాల్గుణ కుమార్, కార్యవర్గ సభ్యులు, తెలంగాణ మాజీ ఎన్నికల ప్రధానాధికారి నాగిరెడ్డి, పి.రఘు, రాం శంకర్ నాయక్, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు కల్కూర చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ అధ్యక్షులు, మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.భవానీ ప్రసాద్

## స్వర్ణోత్సవ జేజేలు

ఉద్యమం సజీవం
వర్తమానం నిజం
భవిష్యత్తు అబద్ధం
ఇది అరుదైన సందర్భం
ఇది అనిర్వచనీయ సంరంబం
మహోన్నత ఆశయాలతో సాగుతున్న
యుటిఎఫ్ సైన్యానికి
స్వర్ణోత్సవ జేజేలు
త్యాగాలతో నిర్మించిన సంఘం మనది
సమున్నత ఆశయాల సాధనలో సాగుతున్న
సంఘం మనది
తిరోగమన వ్యవస్థల్ని పురోగామిదిశగా నడిపించే సంఘం మనది
ఏడు పదులు దాటిన ముదుసలిభారతంలో
యాభైఏళ్ళ చైతన్యం మన సంఘం
పాలకుల మెడలొంచి మన హక్కుల్ని సాధించే సంఘం మనది
పిడికిలి బిగించి పోరాడదాం
గొంతెత్తి రణన్నినాదం చేద్దాం
సమసమాజంవైపు కలిసినడుద్దాం
సమసమాజనిర్మాణానికి రాళ్ళెత్తేకూలీలౌదాం

**-కెంగార మోహన్ , రాష్ట్ర అధ్యక్షులు,సాహితీస్రవంతి**
**(యూటిఎఫ్ స్వర్ణోత్సవ ప్రారంభ సంబరాల్లో చదివిన కవిత)**

# 16న బంద్‌ను జయప్రదం చేయండి

**రవాణా రంగ కార్మిక సంఘాల ఉమ్మడి తీర్మానం**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

భారతీయ న్యాయ సహిత (బిఎన్ఎస్) చట్టం 2023 లోని సెక్షన్ 106(1), (2) రద్దు చేయాలని కోరుతూ ఈనెల 16న నిర్వహించే రోడ్డు రవాణా రంగకార్మికుల దేశవ్యాప్త బందులోకర్నూలు జిల్లా రవాణా రంగ ఆటో, ఇతరకార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఉమ్మడి రవాణరంగ కార్మిక సంఘాల నాయకులు తీర్మానించారు. ఆదివారం కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో ఆటో యూనియన్ జిల్లా నాయకులు బి.రాధాకృష్ణ అధ్యక్షతన సిఐటియు , ఎఐటియుసి అనుబంధ రవాణా రంగ కార్మిక సంఘాల ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్‌టిసి ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కోశాధికారి జె. దివాకర్, కర్నూలు జిల్లా సిఐటియు అధ్యక్షులు పిఎస్.రాధాకష్ణ, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, సిఐటియు న్యూ సిటీ కార్యదర్శి ఆర్.నరసింహులు, ఎఐటియుసి నగర ఆటో యూనియన్ కార్యదర్శి కృష్ణారెడ్డి (కిట్టు) మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రోడ్డు కండిషన్, వెహికల్ కండిషన్ , డ్రైవర్ల పని భారాన్ని పరిగణలోకి తీసుకోకుండా ప్రమాదం జరిగితే డ్రైవర్లను దోషిగా చేస్తూ శిక్షించే విధానాన్ని తక్షణం వెనక్కి తీసుకోవాలని సమావేశం డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మికులందరికీ కనీస వేతనాల చట్టాన్ని అమలు చేయాలని, అసంఘటిత రంగంలోని కార్మికులందరికీ సామాజిక భద్రత కల్పించాలని, పని పరిస్థితులను మెరుగుపరచాలని సమావేశం డిమాండ్ చేసింది. ఈనెల16 సమ్మెకు ఆటోల బంద్ , రవాణా రంగ కార్మికుల సమ్మెకు స్కూలు యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు సానుభూతితో సహకరించి మద్దతు ఇవ్వాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని అభ్యర్థించింది. సమ్మె సన్నాహక కార్యక్రమంలో భాగంగా ఈనెల13న జీపు జాతా, రవాణా రంగ కార్మికుల అందరి నుండి విస్తృతంగా బిఎన్ఎస్ చట్టానికి వ్యతిరేకంగా సంతకాలు సేకరించాలని సమావేశం నిర్ణయించింది. సిఐటియు, జిల్లా కార్యదర్శి మహమూద్, రవి, ఎఐటియుసి ఆటో యూనియన్ అధ్యక్షులు రాము ,నగర నాయకులు ఈశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జె.దివాకర్

## ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఆదివారం నుండి జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్‌కు 3444 మంది విద్యార్థులకు గాను 3339 మంది విద్యార్థులు హాజరయ్యారు. 105 మంది విద్యార్థులు గైరహాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ప్రాక్టికల్స్‌కు 2799 మంది విద్యార్థులకు గాను 2717 మంది విద్యార్థులు హాజరయ్యారు. 82 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

## వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించుదాం

**ప్రజాశక్తి కర్నూలు హాస్పిటల్**

వైసిపి ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికలలో గద్దె దించుదామని మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కల్లూరు అర్బన్ 19వ వార్డ్ ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ కాలనీలో బాబు శ్యూరిటీ – భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో సమస్యలు తెలుసుకుంటూ చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన మినీ మేనిఫెస్టో సూపర్ సిక్స్ పథకాల గురించి గౌరు చరిత రెడ్డి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తం రెడ్డి,19 వ వార్డ్ ఇంచార్జి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, నాయకులు రామక్రిష్ణ రెడ్డి, తిక్కన్న, కరిశ్, ప్రణీత్ రెడ్డి, వీరేశ్, నాగ భూషణం, నవీన్,తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్ ఆస్తులకు రక్షణ కల్పించాలి

**ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వాల చిత్తశుద్ధి అవసరం**
**ముస్లిం గర్జనలో వక్తలు**

**ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్**

వక్ఫ్ ఆస్తులకు రక్షణ కల్పించి, ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పని చేయాలని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం కర్నూలు నగరంలోని మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో డాక్టర్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో ముస్లిం గర్జన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తాటిపాడు మహబూబ్ బాషా, రిటైర్డ్ డిఎస్‌పి మహబూబ్ బాషా, రిటైర్డ్ తహశీల్దార్ ఎంఆర్ఎఫ్ ప్రధాన కార్యదర్శి రోషన్ అలీ, రిటైర్డ్ డిఎస్.హుస్సేన్‌పీరా, ఎంఎండి పాషా, సికిందర్ , ముఫ్తీ అబ్దుల్ రెహమాన్, రిటైర్డ్ జడ్జి నసీరుద్దీన్, సుభాన్ సాహెబ్, సోయాబుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వక్ఫ్ భూములు 66 వేల ఎకరాలు ఉండగా కర్నూలు జిల్లాలోనే 30 వేల ఎకరాలు భూములు ఉన్నాయని తెలిపారు. ఈ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని తెలిపారు. ముస్లిం ప్రజానీకం అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారని తెలిపారు. వక్ఫ్ భూములకు రక్షణ కల్పించి ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పని చేయాలని విజ్ఞప్తి చేశారు. చదువులో వెనుకబడి ఉన్నారని అలాంటి ముస్లింలకు ఉర్దూ, అరబ్బీ మీడియం తొలగించి మదరసాలను ప్రోత్సహించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. హక్కులను సాధించు కోవడానికి ముస్లింలు అందరూ ఐక్యమత్యం సంఘటితం కావల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ముస్లిం సంఘాల నాయకులు కార్యకర్తలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





ముస్లిం గర్జనలో మాట్లాడుతున్న రిటైర్డ్ డిఎస్‌పి మహబూబ్‌బాష

# ఎన్నికల ఏర్పాట్లపై దృష్టి

- శాంతిభద్రతలపై ప్రత్యేక నిఘా
- రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్, బైండోవర్ కేసులు
- దొంగతనాల నివారణకు ప్రత్యేక నిఘా
- ప్రజాశక్తితో డిఎస్‌పి విజయ శేఖర్

**ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్**

రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు రానున్న నేపథ్యంలో నిర్వహణ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించామని కర్నూలు టౌన్ డీఎస్పీ కె.విజయ శేఖర్ తెలిపారు. కర్నూలు పోలీసు సబ్ డివిజన్ పరిధిలో నేర నివారణ, శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలను మరింత పటిష్ఠం చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు...

**శాంతిభద్రతల విషయంలో ప్రస్తుతం ఏ అంశాన్ని ప్రాధాన్యతగా గుర్తిస్తున్నారు..?**

**డీఎస్పీ :** కర్నూలు పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ప్రధానంగా ఎన్నికల ఏర్పాట్లు, శాంతిభద్రతల అంశంపై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాం. ముఖ్యంగా రెవెన్యూ అధికారుల సమన్వయంతో ముందుకు సాగుతున్నాం. అందులో భాగంగా ప్రతి పోలింగ్ కేంద్రాన్నీ ప్రత్యక్షంగా సందర్శించి అక్కడ ఉన్న లోటుపాట్లను గుర్తించి ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్నాం. ఏమైనా లోపాలు ఉంటే వాటిని సరిదిద్దుతున్నాం. ఒక్కో లైజనింగ్ ఆఫీసర్‌కు కొన్ని రూట్లను బాధ్యతగా అప్పగించాం.

**సమస్యాత్మక గ్రామాలున్నాయా..? ఉంటే వాటిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?**

**డీఎస్పీ :** కర్నూలు సబ్ డివిజన్ పరిధిలో సుమారు 15 సమస్యాత్మక గ్రామాలు ఉన్నాయి. ఇలాంటి గ్రామాలపై ప్రత్యేక నిఘాను ఉంచాం. అలాంటి ప్రాంతాల్లో వారంలో ఏదో ఒక స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో రాత్రి బస చేస్తున్నాం. గ్రామాల్లో ఫ్యాక్షన్, కక్షలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని.. అసాంఘిక కార్యకలాపాలకు గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం.

**గొడవలను నివారించడానికి ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు..?**

**డీఎస్పీ :** ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో గొడవలు, నేరాలు తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా ప్రతి వారం డివిజన్ పరిధిలోని ఏదో ఒక స్టేషన్ పరిధిలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్లను నిర్వహిస్తున్నాం. వాటిలో ఏమైనా అనుమానిత వస్తువులు కానీ, ప్రాణాపాయ వస్తువులు కానీ, చట్టవిరుద్ధంగా వినియోగించే వస్తువులను, వాహనాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తున్నాం. ప్రజలకు శాంతిభద్రతలపై అవగాహన కల్పిస్తున్నాం.

**నాటుసారా, అక్రమ మద్యం తయారీ, రవాణా దారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?**

**డీఎస్పీ :** ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించే దిశగా నాటుసారా కేంద్రాలపై కూడా ప్రత్యేక నిఘాను ఉంచాం. నాటు సారా తయారీ కేంద్రాలపై భారీ ఎత్తున దాడులను నిర్వహిస్తున్నాం. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఉలిందకొండ సమీప తండాలు, బంగారుపేట లాంటి పలు తయారు కేంద్రాల్లో పెద్ద ఎత్తున దాడులను నిర్వహించాం. ఎప్పటికప్పుడు నాటు సారా ఊటలను ధ్వంసం చేసి భారీ ఎత్తున నాటు సారాను స్వాధీనం చేసుకుంటున్నాం. తయారీదారులపై ఎన్‌డిపిఎల్ కేసులను నమోదు చేసి జైలుకు పంపుతున్నాం.

**రౌడీషీటర్ల నుంచి ప్రజలకు ఎలాంటి రక్షణ కల్పిస్తున్నారు..?**

**డీఎస్పీ :** రౌడీలు, గుండాలుగా చలామణి అవుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే వారిని సంబంధిత స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. ఎన్నికల్లో ఏమైనా ఆటంకాలు కల్పించే పరిస్థితి ఉంటే అలాంటి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేసి కస్టడీకి పంపుతున్నాం.

**నగరంలో దొంగతనాలు పెరుగుతున్నాయి.. అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?**

**డీఎస్పీ :** కర్నూలు నగరం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇటీవల కాలంలో కొంత మేరకు దొంగతనాలు చోటు చేసుకుంటున్న మాట వాస్తవమే. వాటిని అరికట్టడానికి ప్రత్యేకమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశాం. అందుకోసం వీధుల్లో బ్లూకోల్ట్ వాహనాలను, క్యూఆర్‌టి వాహనాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు నిఘా కోసం రాత్రి వేళల్లో గస్తీని మరింత పెంచాం. ఇంటి దొంగతనాల నివారణకు లాక్‌డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్ఎంఎస్) విధానాన్ని అమలు చేస్తున్నాం. ఎవరైనా ఇంటికి తాళం వేసి మూడు, నాలుగు రోజులు ఇతర ఊళ్లకు వెళ్లాల్సి వస్తే వారు సంబంధిత పోలీసు స్టేషన్ పరిధిలో సమాచారం అందజేయాలి. పోలీసులు ఆ ఇంటిపై ప్రత్యేక నిఘా ఉంచి రక్షణ కల్పిస్తారు. అపార్ట్‌మెంట్లలో, జనం గుమిగూడే వ్యాపార కేంద్రాల్లో తప్పనిసరిగా సంబంధిత యాజమాన్యం సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

## ఉల్లి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

**- ఎపి రైతు సంఘం హెచ్చరిక**

**ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్**

కర్నూలు జిల్లాలో బోరు బావుల దగ్గర అత్యంత కష్టపడి విపరీతమైన పెట్టుబడులు పెట్టి ఉల్లి పంట పండిస్తే సరైన ధర లేకపోవడం వలన రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారని తక్షణమే కర్నూలు మార్కెట్ యార్డు పాలకవర్గం ,మార్కెట్ అధికారులు జోక్యం చేసుకొని క్వింటాలుకు రూ.మూడు వేలకు తక్కువ కాకుండా ధర కల్పించాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రామకృష్ణ ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లాలో ఇప్పటికే అనేక రకాల పంటలు వేసి పంటలు దిగుబడి రాక ఖరీఫ్‌లో వేసిన పంటలు పీకి పారేసిన పరిస్థితి ఉందని, అక్కడక్కడ బోరుబావుల కింద ఉల్లి, టమోటా తదితర కూరగాయల పంటలు సాగు చేస్తే గిట్టుబాటు ధర కల్పించడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఉల్లి పంటకు ఎకరాకు రూ.లక్ష రూపాయలకు పైగా పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని, కానీ ధర కింటాలుకు రూ.300 మొదలుకొని రూ.800 మార్కెట్లో పలుకుతున్నప్పుడు గిట్టుబాటు కాక రైతులు లబోదిబోమంటున్నారన్నారు. అప్పుల పాలయితున్నారని వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి పాలకవర్గం మార్కెట్ యార్డులో జరుగుతున్నటువంటి వ్యాపారస్తుల సిండికేట్ ను అరికట్టి రైతులకు న్యాయమైన ధర వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నవంబర్, డిసెంబర్ మాసంలో రూ.5000 నుంచి రూ.7000 దాకా ధరపలికిన ఉల్లి పంట ఇప్పుడు పడిపోవడానికి ప్రభుత్వం బాధ్యత వహించి నష్టాన్ని బోనస్ రూపంలో రైతులకు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థులకు క్రీడల సాధన అవసరం

**సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర శర్మ**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

విద్యార్థులు జీవితంలో క్రమశిక్షణ గల పౌరులుగా ఎదగాలంటే క్రీడలకు మించిన సాధనం లేదని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర శర్మ సూచించారు. కర్నూలు నగరంలోని కిడ్స్ వరల్డ్ లో ఏర్పాటుచేసిన సిలంభం మార్షల్ ఆర్ట్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా హాకీ క్రీడా సంఘం కార్యదర్శి దాసరి సుధీర్, జిల్లా ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు కొండేపోగు సుంకన్న , జిల్లా సిలంబం క్రీడా కార్యదర్శి రాఘవేంద్ర ,గౌస్ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ మన దేశ ప్రాచీన క్రీడ ఆయన సిలంబంను కర్నూల్లో అభివృద్ధి చేసేందుకు తన వంతు సహకారం అందిస్తున్నానని వివరించారు. ముఖ్యంగా సిలంబం లాంటి మార్షల్ ఆర్ట్స్ లో సాధన చేయడం వల్ల శరీరానికి పూర్తిస్థాయి వ్యాయామం లభించి ఆరోగ్యంగా జీవించవచ్చని చెప్పారు. ఈ క్రీడా సాధన ద్వారా దేహదారుఢ్యం మెరుగుపడుతుందన్నారు. యోగా, ప్రాణాయామం, ధ్యానం వంటి శారీరక ఆరోగ్యానికి ఉపయోగపడే ప్రక్రియలు అలవాటు పడతాయని వివరించారు. ఈ క్రీడలో పాల్గొనడం వల్ల శారీరక మానసిక ఆరోగ్య మెరుగుపడటంతో పాటు ఏకాగ్రత, క్రమశిక్షణ అలవాటు పడుతాయని తెలిపారు. సిలంబం లాంటి క్రీడల్లో పాల్గొనప్పుడు గాయాలకు గురి అయ్యే అవకాశం ఉందని అవసరమైన జాగ్రత్తలు తీసుకొని ఈ క్రీడల్లో రాణించాలన్నారు. ముఖ్యంగా మార్చల్ ఆర్ట్స్‌లో సాధన చేయడం వల్ల చక్కటి క్రమశిక్షణ అలబడుతుందని చెప్పారు. మనిషి బాగుపడటానికి 100 కారణాలు ఉంటే చెడిపోవడానికి వెయ్యి కారణాలు ఉంటాయని వీటిని గుర్తించి మంచి అలవాట్లను పెంపొందించుకోవాలని చెప్పారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల విద్యా ఉద్యోగ ఉపాధి రంగాల్లో మంచి అవకాశాలు ఉంటాయని చెప్పారు. నగరంలో శిలంబం క్రీడను శిక్షణ ఇస్తున్న శిక్షకుడు రాఘవేంద్రను అభినందించారు.

## మంచి చేయడంలో ముందుంటాం : టిజి.భరత్

**ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్**

కర్నూలు ప్రజలకు సేవ చేసేందుకు తాము ఎప్పుడూ ముందుంటామని కర్నూలు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి టిజి భరత్ అన్నారు. నగరంలోని బుధవారపేట ఆర్చ్ వద్ద ఆదరణ డేకేర్ సెంటర్ ఆధ్వర్యంలో పేద మహిళలకు, వృద్ధులకు చీరల పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన కర్నూలు ప్రజలకు సేవ చేయడం కోసమే రాజకీయాల్లోకి వచ్చినట్లు చెప్పారు. కులం, మతం చూడకుండా అందరికీ తాము మేలు చేస్తామన్నారు. ఈ ఐదేళ్ల పాలన ఎలా ఉందో అందరూ చూశారని.. వచ్చే ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆదరణ డేకేర్ సెంటర్ నిర్వాహకులకు ఎప్పటికీ తమ సహకారం ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపికి అందరూ మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నేతలు రామాంజనేయులు, అబ్బాస్, ముంతాజ్, నరేంద్ర, ఆదరణ డేకేర్ సెంటర్ అధ్యక్షులు రంజిత్, టిడిపి బూత్ ఇంచార్జీలు, తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న టిజి.భరత్

నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

## అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

**- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి**

**ప్రజాశక్తి-ఆలూరు**

కార్మికుల సమస్యలను పరిష్కరించలేని వైసిపి ప్రభుత్వం అరెస్టులకు పాల్పడడం సిగ్గుచేటని, అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణ స్వామి, యుఈసిడబ్ల్యుయు డివిజన్ కార్యదర్శి కెఎన్.మాబు తెలిపారు. ఆదివారం విద్యుత్ కాంట్రాక్టు వర్కర్స్ సమస్యలను పరిష్కరించాలని విజయవాడలో జరిగే నిరాహారదీక్షలకు వెళ్లకుండా పోలీసులు నోటీసులు ఇచ్చి అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. విద్యుత్ కాంట్రాక్టు వర్కర్స్‌ను రెగ్యులర్ చేస్తానని అధికారంలోకి రాకముందు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హామీఇచ్చారని, మాట ఇచ్చి తప్పినందుకు అనేక ఆందోళన, ధర్నాలు చేసి నిరహదీక్షకు సిద్ధమైనట్లు తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే భవిషత్తులో ఓటుతో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

## దూదేకుల ఐక్యతతో హక్కుల సాధన

**- దూదేకుల సంఘం నాయకులు మలకన్న**

సమావేశంలో మాట్లాడుతున్న మలకన్న

**ప్రజాశక్తి - దేవనకొండ**

దూదేకులు (నూర్ బాషా) ఐక్యతతో హక్కుల సాధన కోసం ఉద్యమించాలని ఆ సంఘం నాయకులు మలకన్న, నబి రసూల్, అల్లిపీరా తెలిపారు. ఆదివారం దేవనకొండ రెయిన్‌బో పాఠశాల ఆవరణలో దూదేకుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దూదేకుల సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ ముందుండాలని కోరారు. ఆర్థికంగా వెనుకబాటులో ఉన్న కుటుంబాల పిల్లల ఉన్నత చదువుల కోసం, ఆపదలో ఉన్న కుటుంబాలకు చేయూత కల్పించడానికి దూదేకుల సంఘం మండల సంక్షేమ నిధి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. త్వరలో మండల స్థాయి కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. చట్టసభల్లో దూదేకులకు ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు ఇవ్వాలని రాష్ట్ర, జిల్లా కమిటీలు ఆందోళనలు కూడా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దూదేకుల హక్కుల సాధన కోసం పోరాటాలు చేయాలని కోరారు. నూర్ బాషా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

**- ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోకారి, జనార్ధన్**

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎస్‌టియు నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌ను ఎస్‌టియు ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.గోకారి టి.కె జనార్ధన్, సీనియర్ నాయకులు ఉన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో మెడికల్ బిల్లులు ,ఎన్‌ఒసిలు, విచారణలను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. సుదీర్ఘ కాలం పాటు పెండింగులో ఉన్న ఉపాధ్యాయుల సర్వీస్ రేగ్యులరైజేషన్ ప్రక్రియను చేపట్టాలని వారు కోరారు. 2017లో సమగ్ర శిక్ష అభియాన్ కింద అదనపు తరగతి గదులు మంజూరయి మధ్యలో నిలిచిపోయి అసంపూర్తిగా ఉన్న అదనపు తరగతి గదుల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. పాఠశాల నిర్వహణ నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేయాలన్నారు.

డిఇఒతో మాట్లాడుతున్న ఎస్‌టియు నాయకులు

# ఉపాధి కోసం తప్పని వలసలు

**- పని దినాలు లేవని చేతులెత్తేసిన అధికారులు..!**

**ప్రజాశక్తి-తుగ్గలి**

మండలం పరిధిలోని వివిధ గ్రామాలలో జాతీయ ఉపాధి హామీ పథకంలో ఉపాధి పనులు ప్రారంభం కావడం లేదు. కూలీలకు పని దినాలు అయిపోయాయని అధికారులు చేతులు ఎత్తివేయడంతో గ్రామాలలో వలసలు తప్పడం లేదు. తుగ్గలి మండలం పరిధిలోని కొన్ని గ్రామాలలో మాత్రమే ఉపాధి పనులు ప్రారంభమయ్యాయి. అవి కూడా పని దినాలు ఉన్న వారికే అధికారులు కల్పించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పిస్తామని, వలసలు వెళ్లొదని ఒక ప్రక్క చెపుతున్నప్పటికే కూలీలకు మ్యాండేజ్ లేకపోవడంతో పనులు కల్పించలేమని అధికారులు చేతులెత్తేశారు. ప్రతి సంవత్సరం తుగ్గలి మండలంలో 30 వేల మంది కూలీలు దాకా ఉపాధి పనులు చేసే వారు. ప్రస్తుతం కేవలం 5000 లోపు మాత్రమే ఉపాధి కూలీలు పనులు చేస్తున్నారు. ప్రభుత్వం అమలపరిచిన మ్యాండెజీ, ఫొటో క్యాప్స్, లేకపోవడం, పనులు చేసిన కూలీలు పడకపోవడంతో ఇప్పటికే చాలా మంది కూలీలు సుధీర ప్రాంతాలకు వలసలు వెళ్లారు. కేంద్ర ప్రభుత్వం పెట్టిన షరతులకు జాతీయ ఉపాధి హామీ చట్టంలో కూలీలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తుగ్గలి మండలం కరువు మండలంగా ప్రకటించి ఉంటే మరో అదనంగా ప్రతికూలీకి 50 పనిదినాలు కలిసి వచ్చేవి. కరువు మండలంగా ప్రకటించక పోవడంతో పని దినాలు కలిసి రాకపోవడంతో కూలీలకు వలసలు తప్పడం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికారుల స్పందించి మండలంలో జాతీయ ఉపాధి హామీ చట్టం కింద పనులు కల్పించి, కూలీలు సుధీర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా చూడాలని మండలంలోని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

వలసలు వెళ్తున్న కూలీలు

### పని దినాలు లేకనే ఉపాధి కల్పించలేకపోతున్నాం

**- ఎపిఒ రామకృష్ణ**

తుగ్గలి మండలంలోని వివిధ గ్రామాలలో ఉపాధి కూలీలకు పని దినాలు లేనందుని వారికి ఉపాధి పనులు కల్పించలేకపోతున్నాం. మండలంలో పని దినాలు మిగిలి ఉన్న వారందరికీ పనులు కల్పించాం. జాబ్ కార్డు ఉండి పని దినాలు మిగిలి ఉన్న ప్రతి ఒక్కరికి తక్షణమే ఉపాధిలో పనులు కల్పిస్తున్నాం.

## నాటుసారా స్థావరాలపై దాడులు

**- భారీగా పట్టుబడిన నాటుసారా**

**ప్రజాశక్తి - పెద్దకడబూరు**

నాటుసారాను పట్టుకున్న పోలీసులు

ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు నాటుసారా స్థావరాలపై ఆదివారం పోలీసులు విస్తృత దాడులు నిర్వహించారు. ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య ఆధ్వర్యంలో కోసిగి సిఐ ప్రసాద్ పర్యవేక్షణలో పెద్దకడబూరు ఎస్ఐ మహేష్ కుమార్, పోలీసు సిబ్బంది కలిసి హనుమాపురం కొండల్లోని నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి, 40 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో నాటుసారా తయారీ చేసినా, కలిగి ఉన్నా, అక్రమ రవాణా పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## అక్రమ తరలింపు మద్యం స్వాధీనం

**ప్రజాశక్తి - ఆదోని**

అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఆదోని పట్టణ టూ టౌన్ సిఐ డి.గోపి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాచారం మేరకు ఆదోనిలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి కాలనీలో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. 384 టెట్రా ప్యాకెట్ల మద్యం పట్టుకొని నిందితురాలు బుజ్జమ్మను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలిస్తామని వెల్లడించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రాష్ట్రంలో జగన్ పతనం ఖాయం

**- పరిపాలనలో జగన్ విఫలం - జగన్‌ను తరిమి కొట్టడానికి ప్రజలు 'సిద్ధం'**

**- కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి**

**ప్రజాశక్తి - నందవరం**

రాష్ట్రాన్ని పరిపాలించడంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఘోరంగా విఫలం చెందారని, రాష్ట్రంలో జగన్ పతనం ఖాయమని మాజీ కేంద్ర మంత్రి, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ ఎన్నికల్లో జగన్‌ను తరిమి కొట్టడానికి ప్రజలు 'సిద్ధం'గా ఉన్నారని పేర్కొన్నారు. ఆదివారం నందవరం మండలం కనకవీడు గ్రామంలో టిడిపి నాయకులు బోయ పెద్ద ఈరన్న కుమారుడు రామకృష్ణ, ఉమాదేవి వివాహానికి కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల యుద్ధానికి టిడిపి శ్రేణులు సంసిద్ధంగా ఉన్నారని తెలిపారు. జగన్ తన పాలనలో 'ధన'యజ్ఞానికి పాల్పడి 'జల'యజ్ఞాన్ని విస్మరించారని విమర్శించారు. సీమ ప్రాజెక్టులను తెలంగాణకు తాకట్టు పెట్టడంతో.. సీమ ఎడారిగా మారే పరిస్థితి నెలకొందని తెలిపారు. సీమ పల్లెలు కరువుతో వలసబాట పట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు నాయుడు సహకారంతో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులైన వేదవతి, గుండ్రేవుల, ఆర్‌డిఎస్ కుడికాలువ నిర్మాణం, ఎల్‌ఎల్‌సి అండర్ గ్రౌండ్ పైపులైన్ పనులను పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలంగా మార్చి రైతులకు అంకితం చేస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతేడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేసి, నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తానని ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చారని తెలిపారు. నేడు జాబ్ లెస్ క్యాలెండర్ విడుదల చేయడమే కాకుండా మెగా డీఎస్సీ పేరుతో కేవలం 6,100 టీచర్ పోస్టులను విడుదల చేసి యువతను 'దగా' చేశారని మండిపడ్డారు. ఉద్యోగ భద్రతకు, కనీస వేతనాల అమలు కోసం సమ్మె చేసిన మున్సిపల్ పారిశుధ్య కార్మికులపైనా, అంగన్వాడీలపైనా 'ఎస్మా' చట్టం ప్రయోగించారని, వారి తిరుగుబాటుతో జగన్ 'భస్మం' కాక తప్పదని తెలిపారు. ఆశా వర్కర్లపై పోలీసులు వ్యవహరించిన తీరు సరైంది కాదని విమర్శించారు. అభివృద్ధి పేరుతో అప్పులు తెచ్చి బటన్ నొక్కడానికే పరిమితమైన జగన్‌ను ఎన్నికల్లో ప్రజలు 'సైకిల్' గుర్తుపై బటన్ నొక్కి సాగనంపడానికి జనం సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో టిడిపి అధికారం చేపట్టి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. టిడిపి నాయకులు, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కె.పార్థసారథి రెడ్డి, ఆరవీటి సుధాకర్ శెట్టి, కదిరికోట ఆదెన్న, కె.తిమ్మాపురం కురుమన్న, ఆఫ్ఘన్ వలీ బాష, టిడిపి కనకవీడు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న కేంద్ర మాజీ మంత్రి కోట్ల

## లోకేష్ పూరించిన నాదం శంఖారావం

**- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు**

**ప్రజాశక్తి - ఆదోని**

జగన్ రెడ్డి అరాచక పాలనపై టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పూరించిన నాదం శంఖారావమని టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పన్నుల భారం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, ఎక్కడ చూసినా నిరుద్యోగ యువత నిరాశ, నిస్పృహతో రోడ్డు పాలు కావడం, గంజాయి లాంటి వాటికి బానిసలు కావడం, మహిళలపై నిత్యం హత్యాచారాలు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రతిపక్ష నాయకులపై దాడులు, అక్రమ అరెస్టులు, కూల్చివేతలు వంటి అప్రజాస్వామిక విధానాలతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. వారికి మనోధైర్యం కల్పించేందుకు లోకేష్ 'యువగళం' పాదయాత్ర నిర్వహించారని చెప్పారు. కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించ లేకపోవడంతో ప్రస్తుతం రాష్ట్రంలోని 120 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 40 నుంచి 50 రోజులపాటు 'శంఖారావం' పేరుతో ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారని తెలిపారు.

## 18కి టెంకాయల వేలం వాయిదా

**ప్రజాశక్తి - ఆస్పరి**

మండలంలోని ములుగుందం గ్రామంలో వెలిసిన శ్రీహజరత్ దస్తగిరి స్వామి 268వ ఉరుసు సందర్భంగా ఆదివారం దస్తగిరి స్వామి దర్గాలో టెంకాయల వేలం నిర్వహించారు. దర్గా పూజారులు ముని మనుమలు, దర్గా కమిటీ మెంబర్లు వెంకట్ రెడ్డి, కృష్ణమూర్తి, నర్సిరెడ్డి, వడ్ల వెంకటరామయ్య, గ్రామ పెద్దలు చిన్నాయప్ప, మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ వేలం పాటలు నిర్వహించారు. ఈనెల 26న గంధం, 27న ఉరుసు, 28న జియారత్ జరుగుతుందని తెలిపారు. వేలం పాటలో ఇద్దరు పాటదారులు మాత్రమే పాల్గొనడంతో ఈనెల 18కి వాయిదా వేశామన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.10 వేల రుసుము చెల్లించాలని తెలిపారు. పాట దక్కించుకున్న వారు అదే రోజు 25 శాతం డబ్బులు చెల్లించాలని చెప్పారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం

**ప్రజాశక్తి - దేవనకొండ**

కర్ణాటక మద్యం పాకెట్లను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు దేవనకొండ సిఐ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడారు. సిబ్బందితో కలిసి దుబ్బనగుర్తి క్రాస్ దగ్గర తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. పి.కోటకొండ గ్రామానికి చెందిన సురేష్, శివాజీలు మోటార్ సైకిల్‌పై కర్ణాటక ఒరిజినల్ ఛాయిస్ టెట్రా ప్యాకెట్లను కోటకొండ గ్రామానికి చెందిన ఎర్ర బుజ్జి రంగడు దగ్గర కొని తరలిస్తుండగా వారిని అరెస్టు చేసి వారి దగ్గర నుంచి ఒక మోటార్ సైకిల్, 192 (90 ఎంఎల్) టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. విక్రయిస్తున్న ఎర్ర బుజ్జి రంగడు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

## 25 వేల పోస్టులతో డీఎస్సీ విడుదల చేయాలి

**- ఎస్‌టియు నాయకులు**

**ప్రజాశక్తి - ఆదోని**

నాలుగున్నర ఏళ్లు డీఎస్సీ విడుదల చేయకపోవడంతో నిరుత్సాహంగా ఉన్న నిరుద్యోగుల కోసం 25 వేలతో డీఎస్సీ విడుదల చేయాలని ఎస్‌టియు జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న, ఆర్థిక కమిటీ సభ్యులు బి.రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆదోనిలోని ఎస్‌టియు భవన్‌లో మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్ బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పిఆర్‌సి 2022 బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కేవలం 6,100 పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేయడం సబబు కాదన్నారు. 2019లో ఇచ్చిన డిఎ బకాయిలు ఉపాధ్యాయులకు ఇంత వరకు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఎస్‌టియు మండల అధ్యక్షులు సి.రామకృష్ణ, మండల ఆర్థిక కార్యదర్శి పి.షేక్షావలీ, మండల గౌరవాధ్యక్షులు ఎల్.రామ్మోహన్ రెడ్డి, గంగా నాయక్, బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

**- అలనాటి గురువులకు ఘన సన్మానం**

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 1999-2002లో బికాం తెలుగు మీడియం చదువుకున్న పూర్వ విద్యార్థులు 22 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఆదివారం అందరూ కలుసుకొని ఆడుతూ పాడుతూ.. అలనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. అలనాటి అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సురేష్, అధ్యాపకులు అయ్యప్ప, రామకృష్ణ, చంద్ర శేఖర్, పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షులు యగ్గట్టి మహదేవప్ప మాట్లాడారు. ఆర్ట్స్ కళాశాలకు ఓ చరిత్ర ఉందని, ఎందరో విద్యార్థులు ఇక్కడ చదివి నేడు ఉన్నత స్థాయిలో ఉన్నారని తెలిపారు. 22 ఏళ్ల తర్వాత అందరినీ కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు స్వరూప్, అనోక, చిరు, శ్రీనివాస్, వెంకటేష్, గురురాజ, రమేష్, ఉదయ్, రామకృష్ణ, స్వామి, కేశవ్ రెడ్డి, జగదీష్, గిడ్డయ్య పాల్గొన్నారు.

22 ఏళ్ల తర్వాత గురువులతో పూర్వ విద్యార్థులు

## ఘనంగా 'చింతలముని' ఆరాధనోత్సవం

**ప్రజాశక్తి - ఆస్పరి**

మండలంలోని తంగరడోణ గ్రామంలో కొలువైన శ్రీచింతల ముని, నల్లారెడ్డి స్వాముల ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆరాధనోత్సవాల్లో భాగంగా శనివారం రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించారు. ఈ భజన పోటీల్లో 20 జట్లు పాల్గొన్నాయి. గెలుపొందిన జట్లకు ఆదివారం బహుమతులు అందజేశారు. అనంతపురం జిల్లా మరూరు గ్రామానికి చెందిన శ్రీచిన్న కదిరయ్య స్వామి భజన మండలికి మొదటి బహుమతి అర తులం బంగారం దాత సీతారామి రెడ్డి (ప్రతాప్ కాటన్ మిల్) చేతులమీదుగా అందజేశారు. అనంతపురం జిల్లా శంకరపురానికి చెందిన శ్రీరామాంజినేయ్య భజన మండలికి 30 తులాలు వెండి అందజేశారు. అనంతపురం జిల్లా పేటీనికోట గ్రామానికి చెందిన శ్రీసీతా రామాంజినయ్య భజన మండలికి 25 తులాలు వెండి అందజేశారు. అనంతపురం జిల్లా గుత్తి (ఆర్ఎస్)కు చెందిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి భజన మండలికి 20 తులాలు వెండి, అలాగే గోనెగండ్ల మండలం హెచ్.కైరవాడి గ్రామానికి చెందిన శ్రీసుంకల పరమేశ్వరి భజన మండలికి 15 తులాలు వెండి అందజేశారు. విరుపాపురం గ్రామానికి చెందిన శ్రీమారుతి భజన మండలికి 12 తులాలు వెండి, ఆస్పరి మండలం తురవగల్లు గ్రామానికి చెందిన శ్రీసీత రామాంజినేయ్య భజన మండలికి 10 తులాలు వెండి అందజేశారు. ఐనేకల్లు గ్రామానికి చెందిన శ్రీ అంజినయ్య స్వామి భజన మండలికి 8 తులాల వెండి, పుప్పాలదొడ్డి గ్రామానికి చెందిన శ్రీగిడ్డ అంజినయ్య స్వామి భజన మండలికి 6 తులాలు వెండి అందజేశారు. అనంతపురం జిల్లా మైలారం గ్రామానికి చెందిన శ్రీమైలింగేశ్వర భజన మండలికి 5 తులాలు వెండి, హాలిగేర గ్రామానికి చెందిన శ్రీఅంజినయ్య స్వామి భజన మండలికి రూ.2 వేలు అందజేశారు. గ్రామ పెద్దలు రంగన్న, హరనాథ్ రెడ్డి, నల్లారెడ్డి, సిద్ధయ్య స్వామి, సచివాలయ కన్వీనర్ రాజన్న, దస్తగిరి, మునిస్వామి, వెంకటేష్, తిక్కయ్య, నల్లన్న, రంగముని, గోవిందు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గ్రామ పెద్దలు

ఉమాపతి నాయుడును సన్మానిస్తున్న నాయకులు

## వివాహ వేడుకల్లో ఉమాపతి నాయుడు

**ప్రజాశక్తి - ఆదోని**

పట్టణంలోని వాసవీ కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగిన వివాహ వేడుకలకు టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పట్టణానికి చెందిన దేవి, ఎర్రిస్వామి దంపతుల కుమార్తె ఎం.సుజన వివాహం వికాస్‌తో జరిగింది. ఈ మహోత్సవానికి ఉమాపతి నాయుడు హాజరై సందడి చేశారు. పూలమాల, శాలువాతో ఉమాపతి నాయుడును సన్మానించారు. బుద్ధారెడ్డి, కృష్ణారెడ్డి, పెద్దహరివాణం ఆదిశేషరెడ్డి, బాబు నాయుడు, కిష్టప్ప ఉన్నారు.

## టిడిపి నాయకుని సతీమణి మృతి

**ప్రజాశక్తి - ఆదోని**

ఆదోనిలోని దివాకర్ రెడ్డి నగర్‌కు చెందిన టిడిపి నాయకుడు గొల్ల గోపాల్ సతీమణి గొల్ల లక్ష్మి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. టిడిపి 20వ వార్డు ఇన్‌ఛార్జీ శ్రీనివాసాచారి కుటుంబాన్ని పరామర్శించి అంత్య క్రియలకు రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. అదే వార్డుకు చెందిన అయ్యమ్మ కూడా మృతి చెందారు. కుటుంబాన్ని పరామర్శించి దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. డిస్ ఈరన్న, రవి, చాంద్, మల్లప్ప చాకలి, వీరేష్, రామదాస్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న శ్రీనివాస్ ఆచారి

## అత్యంత వైభవంగా 'ఆత్మార్పణ'

**ప్రజాశక్తి - ఆదోని**

పట్టణంలోని వెలసిన ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆత్మార్పణ దినోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో ఆవోపా, యువజన సంఘం మహిళా మండలి సంయుక్త సహకారాలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విటి.ప్రకాష్, వేణు, ఆవోపా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనాథ్ గుప్తా, శ్రీధర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి వాసవీ మాల ఇరుముడి కార్యక్రమం, తదుపరి మాడవీధులలో కన్యకా పరమేశ్వరి దేవత గ్రామ ప్రదర్శన, మూల విరాట్ ఉత్సవ విగ్రహానికి పాలాభిషేకం, కుంకుమార్చనలు, శ్రీవాసవీ హోమం, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు అత్యంత శోభాయమానంగా బంగారు చీరతో భక్తులకు దర్శనమిచ్చారు. నగేరేశ్వర స్వామి, లక్ష్మీ జనార్ధన స్వామి, రాధాకృష్ణులు, ఇతర దేవత మూర్తులు ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. 102 గోత్రాల ఆర్యవైశ్యులు విరివిగా పాల్గొన్నారు.

## ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

**ప్రజాశక్తి - దేవనకొండ**

దేవనకొండ క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం తెల్లవారుజామున ఓ వివాహిత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల మేరకు... దేవనకొండ గ్రామానికి చెందిన ఉప్పర కృష్ణ భార్య ఉప్పర లక్ష్మి(35) గత రెండేళ్లుగా కడుపునొప్పి, మానసిక పరిస్థితి సక్రమంగా లేక అనారోగ్యానికి గురయ్యారు. జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త కృష్ణ కుటుంబ పోషణ కోసం తెలంగాణ రాష్ట్రం వనపర్తిలో పనులకు వెళ్లి వస్తూ ఉండేవారు. భార్య ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న వెంటనే హుటాహుటినా చేరుకొని కన్నీటి పర్యంతమయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మృతదేహం వద్ద రోధిస్తున్న కుటుంబ సభ్యులు

**IN THE COURT OF THE IV ADDL. DISTRICT JUDGE : KURNOOL**
**MVOP NO.215/2023**

B.Lakshmi & 2 Others. ...Petitioners
Vs
M.Yesepu & 2 Others. ...Respondents

**NOTICE TO R1**

**(R1)**
M.Yesepu, S/o M.Jarmiya,
Auto owner - AP21 PY 9696,
R/o H.No.87/27/99/1,
Shareen Nagar, Kurnool.

పైన కనపరిచిన పిటీషనర్స్, నష్టపరిహారం కొరకు మీపైన మరియు ఆర్2, ఆర్3 పైన పై కేసు దాఖలు చేసి ఉన్నాడు. మీ ఆక్షేపన కొరకు కేసు వాయిదా 02-04-2024 తేదిన పై కోర్టులో ఉన్నది. కావున మీరు వకీలు ద్వారా లేదా స్వయంగా గాని 02-04-2024 ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరు అయి తెలుపుకొనవచ్చు. లేనిచో కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వులు)

**Y.Sreenivasulu,**
Advocate for Petitioners,
Opp : District Court,
Kurnool.
Cell : 9440768473



కాలినడక మెట్ల మార్గాన్ని పరిశీలిస్తున్న ఇఒ పెద్దిరాజు

# ఒపిఎస్‌ను సాధించి తీరతాం

## - పోరాటాలకు పుట్టినిల్లు యుటిఎఫ్ - రాష్ట్ర అధ్యక్షులు నక్క వెంకటేశ్వర్లు - ఘనంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాలు ప్రారంభం

**ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్**

యాభై ఏళ్ళ చరిత్ర కలిగిన యుటిఎఫ్ పోరాటాలకు పుట్టినిల్లని, ఉద్యమాలతో ప్రభుత్వం మెడలు వంచి ఉపాధ్యాయుల ప్రతి హక్కులను కాపాడి, ఒపిఎస్‌ను సాధించుకుంటామని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. యుటిఎఫ్‌లో ఉద్యమంలో అమరులయిన కుటుంబాలకు సంఘం అండగా నిలుస్తుందని అన్నారు. పాత పెన్షన్ విధానం సాధించి తీరుతామని సిపిఎస్ రద్దయ్యేవరకు పోరాటం దశల వారీగా చేస్తూనే ఉంటామన్నారు. ఆదివారం కర్నూలు సిల్వర్ జూబిలీ కళాశాలలో యుటిఎఫ్ స్వర్ణోత్సవ నగారా, డప్పుల కొట్టి సంబరాలను ప్రారంభించారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవ లోగోను నాయకులు ఆవిష్కరించారు. సభాధ్యక్షులుగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు యుఆర్‌వి. రవికుమార్ వ్యవహరించారు. సభ ప్రారంభానికి ముందు యుటిఎఫ్ పతాకాన్ని రాష్ట్ర సహాధ్యక్షులు కందుకూరి సురేష్ కుమార్, ఎస్‌టిఎఫ్‌ఐ పతాకాన్ని నక్కావెంకటేశ్వర్లు ఆవిష్కరించి, అక్కడే ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ప్రారంభ సభలో యుటిఎఫ్ జిల్లా తొలి ప్రధానకార్యదర్శి రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య మాట్లాడుతూ అంకితత్వం, ఉద్యమ స్ఫూర్తి ఒక్క యుటిఎఫ్‌కే సాధ్యమన్నారు. పోరాటాలతోనే ఉపాధ్యాయుల ప్రయోజనాలు సాధించుకుంటామని చెప్పారు. ప్రతి కార్యకర్త యుటిఎఫ్ కుటుంబ సభ్యుడన్న విషయాన్ని నాయకత్వం మరచిపోదని తెలిపారు. ఆనాటి నుండి ఈనాటి వరకు అదే ఒరవడి కొనసాగుతున్నదన్నారు. రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్‌కుమార్ మాట్లాడుతూ యుటిఎఫ్ అంటేనే పోరాటాల చరిత్ర అని ఉపాధ్యాయ ఉద్యమ చరిత్రలో సరికొత్త అధ్యాయం రాస్తుందన్నారు. ఈ సంబరాలు ఏడాదంతా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతాయన్నారు. యుటిఎఫ్ మాజీ రాష్ట్రగౌరవాధ్యక్షులు నరసింహులు మాట్లాడుతూ అనేక ఉద్యమాలు నిర్మించి ఉద్యోగ ప్రయోజనాలు సాధించి పెట్టిన సంఘంగా ఘనచరిత్ర కలిగిన సంఘమైన యుటిపఫ్ కోసం చివరి శ్వాస వరకు శ్రమిస్తానన్నారు. కోడుమూరు మాజీ ఎంఇఒ నాగభూషణం శెట్టి యుటిఎఫ్ సుదీర్ఘ ఉద్యమ చరిత్రను పద్యంలో వివరించారు. సభలో కెంగార మోహన్ రచించిన యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల గేయాన్ని ప్రజనాట్యమండలి సీనియర్ నాయకులు ఎంపి బసవరాజు ఆలపించారు. గతంలో నాయకత్వ బాధ్యతలు నిర్వర్తించిన వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి నవీన్‌పాటి స్వాగతం పలుకగా సాహితీస్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్, యుటిఎఫ్ రాష్ట్రనాయకులు నాగమణి, జయరాజు, ఎల్లప్ప, నంద్యాల జిల్లా కార్యదర్శి సుధాకర్, సిఐటియు నాయకులు రామాంజనేయులు, జెవివి నాయకులు సుధీర్ రాజు, జిల్లా ఆర్థిక కార్యదర్శి యెహోషువా తదితరులు సందేశం ఇచ్చారు.

యుటిఎఫ్ జిల్లా మాజీ కార్యదర్శి పుల్లయ్యను సన్మానిస్తున్న నాయకులు

ఎస్‌టిఎఫ్‌ఐ, యుటిఎఫ్ పతాకాలను ఎగురవేస్తున్న నాయకులు నక్కా వెంకటేశ్వర్లు, కె.సురేష్‌కుమార్

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

## - శ్రీశైలం దేవస్థానం ఇఒ పెద్దిరాజు - భక్తులు కాలి నడకన వచ్చే మెట్ల మార్గం పరిశీలన

**ప్రజాశక్తి - శ్రీశైలం**

శ్రీశైలం దేవస్థానంలో మార్చి 8 నుండి జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం ఇఒ పెద్దిరాజు తెలిపారు. మహా శివరాత్రి సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఇఒ ఆదివారం పరిశీలించారు. శివ దీక్ష స్వాముల భక్తులు చంద్రావతి కళ్యాణ మండపంలోని క్యూ లైన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రావతి కళ్యాణ మండపంలోని మరుగుదొడ్ల మరమ్మతుల పనులను వెంటనే చేపట్టాలన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని చెప్పారు. నిరంతరం నీటి సరఫరా వచ్చేలా ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ దీపాలను మరోసారి తనిఖీ చేసుకుని పరిశీలించాలన్నారు. శివ దీక్ష స్వాములు వేచి ఉండే సమయాలలో వారికి మంచినీరు, అల్పాహారం, బిస్కెట్లు అందించేలా ఏర్పాట్లు చేయాలన్నారు ఎమర్జెన్సీ గేట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం బ్రహ్మోత్సవాలలో స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు పాదయాత్రగా వచ్చే భక్తుల కోసం వెంకటాపురం, నాగలూటి, దామర్లకుంట, పెద్దచెరువు, మఠంబావి, భీముని కొలను, కైలాస ద్వారం, భీమునికొలను వరకు మెట్ల మార్గాన్ని పరిశీలించారు. కైలాస ద్వారం వద్ద గతంలో మాదిరిగానే విశాలమైన చలువ పందులు ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలను వెలిగించి, మంచినీటిని సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. మెట్ల మార్గంలో నిరంతరం మంచినీరు భక్తులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కైలాస ద్వారం వద్ద ఏర్పాటు చేసిన 20 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకుకు నిరంతరం నీరు ఉండేలా చూడాలన్నారు. భీమునికొలను మార్గంలో గతంలో మాదిగనే వెయ్యి లీటర్ల సామర్థ్యం గల సింటెక్స్ ట్యాంకులను ఎనిమిది చోట్ల ఏర్పాటు చేయాలని చెప్పారు. కైలాస ద్వారం వద్ద వైద్య శాఖ సమన్వయంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అన్నదాన కార్యక్రమం చేపట్టే దాతలకు దేవస్థానం సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభం కంటే ముందుగానే కాలినడకన భక్తులు వస్తున్న సందర్భంగా ముందుగానే అన్నదాన దాతలు కార్యక్రమం చేసేందుకు ముందుకు రావాలన్నారు. కైలాస ద్వారమంతా ఎప్పటికప్పుడు చెత్తను ఎత్తివేసేందుకు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రామకృష్ణ, నీటి సరఫరా విభాగపు సహాయ ఇంజనీర్ రాజేష్, ఉద్యానవన విభాగ అధికారి లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లు వేస్తే అభివృద్ధి జరిగినట్లా..?

## - మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి

**ప్రజాశక్తి - ప్యాపిలి**

డోన్ నియోజకవర్గంలో రోడ్లు వేసినంత మాత్రానా అభివృద్ధి జరిగినట్లేనా అని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గనను ఉద్దేశిస్తూ మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి అన్నారు. ఆదివారం ప్యాపిలిలోని షాదీఖానాలో జరిగిన వివాహ వేడుకల్లో మాజీ మంత్రి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ప్రజలు మంచి చేస్తారనే ఉద్దేశంతో రాజశేఖరరెడ్డిని చూసి జగన్‌కు ఓటు వేశారన్నారు. నేడు జగన్‌కు ఓటు వేసి ప్రజలు తప్పు చేశామనుకుంటున్నారని తెలిపారు. కెఇ, కోట్ల కుటుంబంపై ప్రజల్లో మంచి ఆదరణ ఉందన్నారు. మంత్రి బుగ్గన తన సొంత మండలం బేతంచర్లను కరువు మండలంగా ప్రకటించుకొని మిగతా మండలాలను ప్రకటించక పోవడం శోచనీయ మన్నారు. డోన్ టికెట్ ఎవరికి అని విలేకరులు అడగగా పార్టీకి సిద్ధాంతాలు కొన్ని ఉంటాయని, హైకమాండ్ ఉందని, వాటిని బహిర్గతం చేయలే మన్నారు. ఆదరణ ఉంది కనుకే ఇంతమంది ప్రజలు ఘన స్వాగతం పలికారన్నారు. ఈ నెల 15న మీ పేరును ప్రకటిస్తారని మరోసారి విలేకరులు ప్రశ్నించగా ఆయన స్పందిస్తూ 'మీరే సమాధానం చెప్తున్నారు కాబట్టి కావచ్చు' అని అన్నారు. కానీ ప్రకటించారని గానీ, అధిష్టానం చెప్పిందని గాని చెప్పకుండా దాటవేశారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు యాదవ్, కేశన్న గౌడ్, ఫణిరాజ్, వలసల రామకృష్ణ, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, వెంకట రమణాచారి, లక్ష్మీ నారాయణ, రామ్మోహన్ యాదవ్, వెంకటేష్, రమేష్, కిట్టు, నాగేంద్ర, కోదండ, ఖాజా పీర్, చల్లా అనుదీప్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ కేంద్ర మంత్రి కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి

# ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

## - సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ అధ్యక్షులు భవానీ ప్రసాద్

**ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి**

ఓటుతోనే సమాజ మార్పు అని, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ అధ్యక్షులు, మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.భవానీ ప్రసాద్ తెలిపారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలులోని త్రిగుణ ఇన్ హోటల్‌లో ఓటు వేద్దాం - ప్రజాస్వామ్య పరిరక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భవానీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం ఉండాల్సిన స్థితిలో లేదన్నారు. రాను రాను నైతికంగా పతనం అవుతోందన్నారు. ఆ సమస్యకు పరిష్కారం ఏమిటనేది ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. ఎన్నుకోవాల్సిన వారిని ఎన్నుకోకపోతే మన భవిష్యత్తు ప్రశ్నార్థకంగా తయారవుతుందన్నారు. సరైన వారిని ఎన్నుకోకపోవడం వల్ల అత్యధిక మంది ప్రజలు బాధను అనుభవిస్తున్నారన్నారు. డబ్బు, మద్యం కోసం ఓటు వేసే పరిస్థితిని మార్చగలిగితే సమాజం ముందుకు వెళతుందని తెలిపారు. ఎన్నికలు మన కోసం మనం చేయాల్సిన యజ్ఞం అని ప్రజలకు తెలియజేయగలిగితే బాగుంటుందన్నారు. మనలను మనం సగర్వంగా నిలబెట్టుకోవడానికి, పిల్లల భవిష్యత్తు బాగుండటానికి, దేశం నైతికంగా ఉండటానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కార్యదర్శి, ఎపి మాజీ ఎన్నికల ప్రధానాధికారి నిమ్మగడ్డ రమేష్ కుమార్ మాట్లాడుతూ ఎపిలో ఒక నిశబ్ద విప్లవం ఆరంభమైందని, బెదిరింపులకు లొంగకుండా ఓటు వేసే పరిస్థితి వస్తుందని తెలిపారు. ప్రజాభిప్రాయంతో ఏర్పడిన ప్రభుత్వానికే విలువ ఉంటుందని సుప్రీం కోర్టు చెప్పిందని, ఓటును ప్రాథమిక హక్కుగా పరిగణించాలని చెప్పిందని తెలిపారు. పౌరుల్లో సామాజిక బాధ్యతను గుర్తు చేయడానికే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. తిరుపతి ఉప ఎన్నికల్లో అక్రమాలకు సంబంధించి ముందుగా చర్యలు తీసుకుని ఉంటే కనువిప్పు కలిగేదన్నారు. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ విచక్షణతో ఓటు వేయాలని కోరారు. ఓటర్ల జాబితాలో లోటుపాట్లను ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకువెళ్తామన్నారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఉపాధ్యక్షులు, మాజీ ముఖ్య కార్యదర్శి ఎల్‌వి.సుబ్రమణ్యం మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికిన నాయకులు ఎన్నికల తరువాత ప్రజల గురించి పట్టించుకోవడం లేదన్నారు. దోచుకోవడంపై ఉన్న దృష్టి ప్రజలకు ఇచ్చిన హామీలపై లేదన్నారు. ప్రజల్లో చైతన్యం ఉంటే సరిపోదని, ప్రజాప్రతినిధుల్లోనూ చైతన్యం తేవాలన్నారు. బాధ్యత గురించి ప్రజాప్రతినిధులు మరచిపోతున్నారన్నారు. ప్రజాప్రతినిధులు గౌరవాన్ని నిలబెట్టుకోవాలని, అప్పుడే సుస్థిరమైన సమాజాన్ని నిర్మించగలమని తెలిపారు. ఒక చట్టం తెస్తే వచ్చే నష్టాలు మంత్రులకు తెలియాలని, ప్రస్తుతం అలా జరగడం లేదని చెప్పారు. ప్రజల్లో నిరాసక్తి వల్ల సమాజం దౌర్భాగ్య స్థితికి పోతోందని, అది క్షేమకరం కాదని తెలిపారు. అనంతరం 'ఓటు వేద్దాం' కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో లెట్స్ ఓట్ సంస్థ జాతీయ కన్వీనర్ సుబ్బరంగయ్య, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ కోశాధికారి పాల్గుణ కుమార్, కార్యవర్గ సభ్యులు, తెలంగాణ మాజీ ఎన్నికల ప్రధానాధికారి నాగిరెడ్డి, పి.రఘు, రాం శంకర్ నాయక్, గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు కల్కూర చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ అధ్యక్షులు, మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.భవానీ ప్రసాద్

ఒప్పంద ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఇఒ

## దేవస్థానం ఒప్పంద ఉద్యోగి కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజాశక్తి - శ్రీశైలం**

శ్రీశైల దేవస్థానంలో ఒప్పంద ఉద్యోగిగా పని చేస్తున్న ఎడివి లక్ష్మయ్య కుటుంబానికి ఒప్పంద, పొరుగు సేవల సిబ్బంది తమ ఒక్కరోజు వేతనాన్ని ఆర్థికసాయంగా ఆదివారం అందజేశారు. శ్రీశైల దేవస్థానంలోని ఆలయ విభాగంలో భజంత్రీలుగా పని చేస్తున్న ఒప్పంద ఉద్యోగి ఎడివి లక్ష్మయ్య గతేడాది నవంబర్ 28న గుండెపోటుతో మరణించారు. దీంతో శ్రీశైలం దేవస్థానం నందు ఒప్పంద, పొరుగు సేవల సిబ్బంది వారి ఒక్కరోజు వేతనాన్ని మొత్తం రూ.2 లక్షల 51 వేల 329లు చెక్కును ఆర్థికసాయంగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు చేతుల మీదుగా ఎడివి లక్ష్మయ్య భార్య వెంకటలక్ష్మమ్మకు అందజేశారు.

## పాణ్యం ఎస్ఐగా నల్లప్ప బాధ్యతలు

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

సాధారణ బదిలీలో భాగంగా కర్నూలు జిల్లా ఉల్లిందకొండ పోలీసు స్టేషన్‌లో సబ్ ఇన్స్పెక్టర్‌గా పని చేస్తు ప్రమోషన్‌పై నంద్యాల జిల్లా పాణ్యం ఎస్ఐగా బదిలీ అయిన సి.నల్లప్ప ఆదివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎస్ఐ జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డిని జిల్లా పోలీస్ కార్యాలయం నందు పూలమొక్కతో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎస్పిని కలిసిన పాణ్యం ఎస్ఐ సి.నల్లప్ప

# 22 నిమిషాల్లో శతావధానం అంశాలన్నీ అప్పగింత

## - తిరుపతి యువకుడు భరత్ కుమార్ శర్మ ధారణ శక్తిని కొనియాడిన ప్రముఖులు

సాహితీవేత్తల ప్రశ్నలకు సమాధానమిస్తున్న భరత్ కుమార

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

పట్టణంలోని డాక్టర్ రామలింగారెడ్డి కళ్యాణ మండపంలో గత మూడు రోజులుగా శతావధాన కార్యక్రమం జరుగుతోంది. మూడవ రోజు ఆదివారం జరిగిన శతావధానం కార్యక్రమంలో తిరుపతికి చెందిన 17 సంవత్సరాల యువకుడు ఉప్పల దడియం భరత్ కుమార్ శర్మ కేవలం 22 నిమిషాల వ్యవధిలోనే శతావధానంలోని సమస్య పురాణం, దత్త పది, పద్యాలను అద్భుతంగా తిరిగి అప్పజెప్పి అద్భుత పాండిత్యంతో సభికులను ఉర్రూతలూగించారు. ఏలూరు ప్రణవ పీఠాధిపతి బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ అనుసంధానకర్తగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ శతావధాన కార్యక్రమంలో భరత్ కుమార్ శర్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పలువురు సాహితీవేత్తలు సంధించిన ప్రశ్నలకు ఈ యువకుడు ఎక్కడ తడుముకోకుండా సమాధానాలు ఇచ్చి అందరినీ ఆశ్చర్య పరిచారు. ప్రపంచ స్థాయిలోనే ఇంత తక్కువ వ్యవధిలో శతావధానం నిర్వహించిన ఘనత దక్కింది. ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలు మాట్లాడుతూ శతావధానంలో భాగంగా ధార, ధారణ, పదప్రయోగం భావవ్యక్తీకరణ పలికించడం ఇటీవల కాలంలో తామెప్పుడూ చూడలేదని కొనియాడారు. భవిష్యత్తులో తెలుగు భాషను కాపాడేందుకు ఇలాంటి అవధాన కిషోరాలే అందరికీ మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా త్రిభాషా సహస్రావధాని, ప్రణవ పీఠాధిపతి బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ అవధాన బాల భాస్కరుడైన ఉప్పలదడియం భరత్ కుమార్ శర్మను శతావధాన తిలక అంటూ బిరుదు ప్రధానం చేసి బేష్ అంటూ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత జిల్లా జడ్జి, అహోబిల మఠం ఒఎస్‌డి కాశీభట్ల శివప్రసాద్, జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్ రెడ్డి, న్యాయవాది వెంకోబరావు, అహోబిలం ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాల్ స్వామి, కానాల మాధవరావు, మధుసూదన రావు, చెలు చలమల రామకృష్ణ, వెదురూరి సుధాకర్ రావు తదితర ప్రముఖులు, జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఆంధ్రోపన్యాసకులు పాల్గొన్నారు.

శతావధాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖుల

ఇఒగా బాధ్యతలు స్వీకరిస్తున్న రామాంజనేయులు

## మద్దిలేటి స్వామి ఆలయం ఇఒగా ఎం.రామాంజనేయులు

**ప్రజాశక్తి - బేతంచెర్ల**

బేతంచెర్ల మండలం ఆర్.ఎస్.రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి నరసింహ స్వామి దేవస్థానం నూతన కార్యనిర్వాహణ అధికారిగా ఎం.రామాంజనేయులు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. వీరికి దేవస్థానం అర్చక, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. అనంతరం ఇఒగా బాధ్యతలు స్వీకరించిన ఎం.రామాంజనేయులును వేదమంత్రోచ్ఛారణతో ఆశీర్వదించారు. అనంతరం ఇఒ క్షేత్ర పరిశీలన చేసి భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, అభివృద్ధి పనులపై ఆరా తీశారు. భక్తులకు సౌకర్యాలు పెంచి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తామని ఆయన అన్నారు.

## పోర్‌లైన్ క్రికెట్ విజేత రాయల్ జట్టు

**ప్రజాశక్తి - చాగలమర్రి**

చాగలమర్రి పట్టణంలో రాయల్ కేఫ్ సమీపంలోని క్రీడా మైదానంలో ఆదివారం జరిగిన పోర్‌లైన్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో చాగలమర్రి పట్టణానికి చెందిన రాయల్స్ జట్టు విజేతగా నిలిచింది. రన్నర్స్‌గా మార్కెట్ లెవెన్ జట్టు నిలిచింది. ఈ సందర్భంగా నిర్వాహకులు సలీం, తాహీర్, వాజీద్‌లు మాట్లాడుతూ రాయల్ జట్టుకు మొదటి బహుమతి రూ.20 వేలు చక్రం బీడీ షబ్బీర్, రెండవ స్థానం మార్కెట్ లెవెన్ జట్టుకు రూ.10 వేలు గోల్డ్‌స్మిత్‌లు జమాల్, షరీఫ్, మూడవ స్థానంలో నిలిచిన రైజింగ్ స్టార్ జట్టుకు రూ. 5 వేలు రాయల్ కేఫ్ రఫీ, నాల్గవ స్థానంలో నిలిచిన సునీల్ జట్టుకు రూ. 3,500లు ముల్లా శ్యాబుల్, మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్ ఎంపికైన సునీల్‌కు రూ.3 వేలు అమరాన్ బ్యాటరీ డీలర్ ఆకుల ఇర్షాద్‌లు అందజేశారు. కార్యక్రమంలో దాతలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

టోర్నమెంట్ విజేతగా నిలిచిన రాయల్ జట్టు

## చైర్మన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**ప్రజాశక్తి - ఆత్మకూర్**

ఆత్మకూరు పట్టణంలోని శ్రీరామ్ నగర్ కప్పలకుంటలో రషీద్ కాంప్లెక్స్‌లో ఎంఎఆర్ క్లీనిక్ డాక్టర్, మున్సిపాలిటీ చైర్మన్ మారుఫ్ ఆసియా ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కో ఆప్షన్ మెంబర్ ఎంఎ రషీద్ ఆధ్వర్యంలో బిపి, షుగర్, హెచ్‌బీ పరీక్షలు ఉచితంగా చేశారు. డాక్టర్లు మారుఫ్ ఆసియా, డాక్టర్ షామి సుల్తానా రోగ నిర్ధారణ పరీక్షలు చేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

వైద్య సేవలు అందిస్తున్న మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా

# నంద్యాలకు ఏం చేశారో చెప్పకునే ధైర్యం టిడిపికి లేదు

## - 4 రోజుల్లో రూ.10 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టాం : ఎమ్మెల్యే శిల్పా

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

నంద్యాలకు ఏమి అభివృద్ధి చేశారో చెప్పుకునే ధైర్యం టిడిపి నాయకులకు లేదని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి ప్రశ్నించారు. కేవలం 4 రోజుల్లో నంద్యాల నియోజక వర్గంలో 10 కోట్ల రూపాయల అభివృద్ధి పనులను చేపట్టామని, అవి టిడిపి వారికి కనిపించడం లేదన్నారు. నేడు నంద్యాలకు తాము ఏమి చేశామో ధైర్యంగా చెబుతున్నామని అన్నారు. ఆదివారం నంద్యాలలోని నూనెపల్లె మార్కెట్ యార్డ్‌లో రూ. 60 లక్షలతో చేపట్టిన 10 షాపింగ్ కాంప్లెక్స్‌లను మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ షాపింగ్ కాంప్లెక్స్‌ల ద్వారా మార్కెట్ యార్డ్ సెల్ఫ్ డెవలప్మెంట్ దిశగా, ఒక ఆదాయ వనరుగా మారు తుందన్నారు. కార్యక్రమంలో. ఎపిపిఎస్‌సి మెంబర్ సిద్ధం శివరాం, మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వర రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, ఎపిఎస్‌పి డిసిఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చిమ్మ నగన్న, వైసిపి నాయకులు పార్దుడు, అమృతరాజ్, శంకర్ నాయక్, కత్తి శంకర్, మునయ్య, చుమ్మ రవి, అప్పన్న గౌడ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

## నేడు పలు అభివృద్ధి పనులు ప్రారంభం

**- కార్యక్రమాన్ని విజయవంతం చేయండి**

**- వైసిపి మండల కన్వీనర్ అంబటి గురివిరెడ్డి**

**ప్రజాశక్తి - కొలిమిగుండ్ల**

కొలిమిగుండ్ల మండలంలోని పరిధిలో పలు అభివృద్ధి పనులను నేడు బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి మండల కన్వీనర్ అంబటి గురివి రెడ్డి కోరారు. ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ నేడు సోమవారం సాయంత్రం 3 గంటలకు మీర్జాపురం గ్రామం, 4 గంటలకు గొర్విమానిపల్లె, 5 గంటలకు కొలిమిగుండ్లలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరవుతారని తెలిపారు. మండలంలోని ఎంపిపి, వైస్ ఎంపిపీలు, ఎంపిటిసిలు, సర్పంచులు, వార్డ్ మెంబర్లు, ప్రజా ప్రతినిధులు, బూత్ కమిటీ కన్వీనర్లు, సభ్యులు, అన్ని అనుబంధ సంఘాల కన్వీనర్లు, సభ్యులు, గృహ సారథుల వాలంటీర్లు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## 14న పెట్నికోటలో భజన పోటీలు

**ప్రజాశక్తి - కొలిమిగుండ్ల**

మండలంలోని పెట్నికోట గ్రామంలో ఈ నెల 14న మహాగణపతి సీతారామ లక్ష్మణ హనుమంత సమేత ధ్వజ శిఖర కలశ దేవాలయ ప్రతిష్ఠ సందర్భంగా భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆదివారం తెలిపారు. భజన పోటీల్లో గెలుపొందిన వారికి మొత్తం 23 బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. మొదటి బహుమతి రూ. 30 వేలు, రెండో బహుమతి రూ. 25 వేలు, మూడో బహుమతి రూ. 20 వేలు, నాలుగో బహుమతి రూ. 15 వేలు, ఐదో బహుమతి రూ. 12 వేలు, ఆరో బహుమతి రూ. 11 వేలు, ఏడవ బహుమతి రూ. 10 వేలుతోపాటు మొత్తం 23 బహుమతులు అందివ్వనున్నట్లు తెలిపారు. భజన బృందం సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వివరాలకు ఫోన్ 8897893549, 9676543815, 9490575897 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

## మాజీ కేంద్ర మంత్రి కోట్లకు సన్మానం

**ప్రజాశక్తి - బేతంచెర్ల**

మాజీ కేంద్ర రైల్వే సహాయ మంత్రి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని బేతంచెర్ల భారత్ బేకరీ సర్కిల్లో టిడిపి నాయకులు ఎస్.ముల్లా సుభాన్ సయ్యద్, అంబాపురం సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, బుక్కాపురం సర్పంచ్ నాగరాజు, వెంకటేశ్వర్లు, గొర్లగుట్ట నారాయణ తదితరులు గజమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ కేంద్రమంత్రి కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి టిడిపి నాయకులతో మాట్లాడుతూ పార్టీ అధిష్ఠానం నిర్ణయం మీద కట్టుబడి ఉన్నామని అన్నారు.

## నేడు 'జగనన్నకు చెబుదాం - స్పందన'

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్ :** నేడు సోమవారం నంద్యాల పట్టణం కలెక్టరేట్లోని వైఎస్ఆర్ సెంటినరీ హాల్లో వినూత్న తరహాలో జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించే స్పందన కార్యక్రమానికి నేడు ఉదయం 9–30 గంటలకు జిల్లా అధికారులందరూ హాజరు కావాలని తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

# సర్వాయిపల్లెలో అహోబిలేషుడికి అభిషేకం

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

అహోబిల లక్ష్మీనరసింహస్వామి పారువేట ఉత్సవాలలో భాగంగా ఉయ్యాలవాడ మండలం సర్వాయిపల్లె గ్రామానికి ఉత్సవ పల్లకి శనివారం చేరుకుంది. రెండవ రోజు ఆదివారం కోనేటి వద్ద గ్రామ ఆనవాయితీ ప్రకారం ప్రహ్లాద వరదస్వామి, జ్వాలా నరసింహ స్వాములకు ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్ ఆధ్వర్యంలో కోనేటి నీటితో పుణ్య స్నానాలు చేయించారు. స్వామివార్లకు క్షీర, పంచామృతాభిషేకాలు చేశారు. గ్రామ సర్పంచి ఉమ, మాజీ సర్పంచి ఆవుల రాఘవేంద్ర రెడ్డి, సన్నిధి సుబ్రహ్మణ్యం, కుటుంబ సభ్యులు తదితరులు పూజలు చేశారు. పారువేటలో భాగంగా అహోబిలేషుడు సంక్రాంతి పర్వదినాన అహోబిలం కొండ దిగి బాచేపల్లిలో మొదటి పూజ అందుకున్నారు. 25 రోజుల తర్వాత సర్వాయి పల్లెలో స్వామివార్లకు ఏకాంత అభిషేకాలు, విశేష నవ కలశ తిరుమంజనం నిర్వహించారు. ఏటా ఈ కార్యక్రమాన్ని సర్వాయిపల్లెలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని అహోబిల దేవస్థానం ప్రధాన అర్చకులు వేణుగోపాలన్ పేర్కొన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో కొనసాగే పారువేట ఉయ్యాలవాడ మండలంలో కేవలం ఒక్క సర్వాయిపల్లె గ్రామానికి పరిమితం కావడంతో చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు భారీగా తరలివచ్చి స్వామివార్లకు పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఎస్సై రామాంజనేయరెడ్డి, పోలీస్ సిబ్బంది బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో విద్యుత్తు డిఈఈ రవికాంత్ చౌదరి, దేవస్థానం ప్రత్యేక అధికారి శివప్రసాద్, అర్చకులు సంతానం స్వామి, శ్రీవత్సన్, శ్రీ శటగోపన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

హాజరైన భక్తులు

# టిడిపి అధికారంలోకి రావడం ఖాయం

**- డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి**

**ప్రజాశక్తి - డోన్**

రానున్న ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావడం ఖాయమని డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం డోన్ మండలంలోని చింతలపేట గ్రామంలో బాబు ష్యూరిటీ– భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం టిడిపి మండల అధ్యక్షులు సలీంద్ర శ్రీనివాసులు యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో నిరుద్యోగులు, రైతులు, నిరుపేదలు ఇలా వైసిపి ప్రభుత్వ పీడితులందరూ జగన్ను ఓడించడానికి సిద్ధంగా ఉన్నారని, జగన్ అమ్మే నాణ్యతలేని మద్యం మూలంగా అనారోగ్యాం బారిన పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో యువత, మహిళలు, రైతులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు ఇలా ఎవరూ కూడా ఆనందంగా లేరన్నారు. దీనికంతటికీ కారణం జగన్ రెడ్డి ఐదేళ్ళ విధ్వంస, అరాచక పాలనేనని చెప్పారు. అందుకే ఎవరూ కూడా జగన్కు మళ్లీ ఓటేసే పరిస్థితిలో లేరని, రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత టిడిపి, జనసేన కార్యకర్తలది మాత్రమే కాదని, ప్రజలందరిపైనా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో డోన్ నియోజకవర్గంలో టిడిపిని గెలిపించుకుని, జగన్ రెడ్డి పాలనకు బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి డోన్ నియోజకవర్గ రైతు కమిటీ అధ్యక్షులు మల్లయ్య, మండల ప్రధాన కార్యదర్శి ఎల్ఐసి శ్రీరాములు, యూనిట్ ఇంచార్జ్ కమలాపురం రమేష్, నియోజకవర్గ బీసీ సెల్ కమిటీ నాయకులు వలసల సుధాకర్, మండల అధ్యక్షులు రామాంజినేయులు, గ్రామ నాయకులు వెంకటరాముడు, చిన్నాన్న, విక్రమార్క రెడ్డి, కమ్మ వెంకట రెడ్డి, మమ్ము, బాలు, రంగస్వామి, గణ మద్దిలేట్టి, వేణు గోపాల్, బాలన్న, రామకృష్ణ రెడ్డి, ఎల్లక్రిష్ణ, మధు, నారాయణ రెడ్డి, కిట్టు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు కరపత్రాల ద్వారా వివరిస్తున్న డోన్ నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి

నివాళులర్పిస్తున్న వెంకటేశ్వర్ రెడ్డి

## ఘనంగా ఘంటసాల వర్ధంతి

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

ఆళ్లగడ్డ పట్టణంలో అమర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి వేడుకలను లలిత కళా సమితి నిర్వాహకులు వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహం వద్ద ఘంటసాల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి కెఆర్ఎం మల్లి, జయసింహారెడ్డి, జానకి రామయ్య, కంబయ్య, రమణయ్య, గ్యాస్ పుల్లయ్య, నాగరాజు, మురార్జీ, నాగేశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంలో పాల్గొన్న విద్యార్థులు

## అహోబిలంలో ఆర్జిఎం విద్యార్థుల శ్రమదానం

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ, దిగువ అహోబిలాల్లో ఆదివారం నంద్యాల ఆర్జీయం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, వలంటీర్లతో 'మన ఊరు మన గుడి మన బాధ్యత' కార్యక్రమంలో భాగంగా శ్రమదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నవ నరసింహ సన్నిధులు, దిగువ అహోబిలం, భైరవ కుండములను శుభ్రం చేశారు. ఆర్జిఎం ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 100 మంది విద్యార్థులు ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి శుభ్రం చేశారు. అహోబిలం దేవస్థానం వారు, ఇంటాక్ నంద్యాల చాప్టర్ వారు కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అహోబిలం మఠం సేతురామన్ పాల్గొన్నారు.

## అహోబిలంలో హాస్యనటి కరాటే కళ్యాణి

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ :** ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామిని సినీ హాస్యనటి కరాటే కళ్యాణి ఆదివారం దర్శించుకుని పూజలు చేశారు. దిగువ అహోబిలంలో కొలువుదీరిన శ్రీ ప్రహ్లాద వరదస్వామిని, అమృతవల్లి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె అహోబిలం చరిత్రను అర్చకులను అడిగి తెలుసుకున్నారు.

# వసంత పంచమికి పటిష్ట భద్రత చర్యలు : సిఐ

**ప్రజాశక్తి - కొత్తపల్లి**

మండలంలోని శివపురం సమీపంలోని కొలనుభారతి దేవి ఆలయంలో ఈ నెల 14న జరిగే వసంత పంచమి వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రత చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు రూరల్ సిఐ నాగభూషన్ తెలిపారు. ఆదివారం కొలనుభారతి దేవి ఆలయంలో వసంతపంచమి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ముందుగా సిఐ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలను, ఎక్కడెక్కడ పోలీసు భద్రత అవసరం, వాహనాల పార్కింగ్ స్థలాన్ని, ట్రఫిక్ అంతరాయం కలగకుండా చేయాల్సిన ఏర్పాట్లపై ఇన్చార్జి ఎస్ఐ అశోక్, ఇఒ మోహన్ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించనున్న వసంత పంచమి వేడుకల్లో భక్తులకు, సందర్శకులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వసంత పంచమికి వచ్చే భక్తుల దృష్ట్యా శివపురం గూడెం వద్ద వాహనాల పార్కింగ్ నిర్వహిస్తామని తెలిపారు. అక్కడి నుండి భక్తులను ప్రత్యేక బస్సుల్లో ఆలయం వద్దకు తరలిస్తామన్నారు. భక్తులు అధికారులకు సహకరించాలని కోరారు. నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచు చంద్రశేఖర్ యాదవ్, పాలకమండలి ఛైర్మన్ వెంకట నాయుడు, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచు శ్రీనివాసులు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వివరాలు తెలుసుకుంటున్న సిఐ

అమ్మవారికి పూజలు చేస్తున్న ప్రజలు

## ఘనంగా అమ్మవారి గ్రామోత్సవం

**ప్రజాశక్తి - రుద్రవరం :** రుద్రవరంలో శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి గ్రామోత్సవం ఆదివారం ఆర్యవైశ్యులు ఘనంగా నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవ సందర్భంగా అమ్మవారి శాలలో ఆర్యవైశ్యులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని గ్రామోత్సవం నిర్వహించారు. **బేతంచెర్ల :** బేతంచెర్ల పట్టణంలోని అమ్మవారి శాలలో మాఘ మాసాన్ని పురస్కరించుకొని వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష కార్యదర్శులు కందగడ్డల మోహన్రావు గురువయ్య ఆధ్వర్యంలో వేద పండితులు విశేష పూజలు చేశారు. వాసవి క్లబ్ అధ్యక్షుడు సుబ్బయ్య గుప్తా, వనిత క్లబ్ అధ్యక్షులు సుభాషిని, శేషమోహన్, గురువయ్య, రమణ ,మధు సురేంద్ర, జనార్ధన్, కిషోర్, శేఖర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గత టిడిపి ప్రభుత్వం హామీలకే పరిమితం

**- శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి**

**ప్రజాశక్తి - పగిడ్యాల :** గత చంద్రబాబు ప్రభుత్వం కేవలం హామీలకే పరిమితమైందని శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి విమర్శించారు. వైఎస్ఆర్ ఆసరా సంబరాల్లో భాగంగా ఆదివారం పగిడ్యాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పసుపు కుంకుమ పేరుతో మహిళలను మోసం చేశారని ఆరోపించారు. చంద్రబాబుకు ఓటమి భయంతోనే జనసేన, బిజెపితో పొత్తులు పెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా విడగొట్టి రాష్ట్ర, పిల్లల భవిష్యత్తును కాంగ్రెస్ నాశనం చేసిందని ఆరోపించారు. సిఎం జగన్మోహన్ రెడ్డి చేసిన మంచి పనుల గురించి వాస్తవాలు మాట్లాడితే ప్రతిపక్ష పార్టీలు అవాస్తవాన్ని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు ఆలోచించి జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. మాజీ జెడ్పిటిసి పుల్యాల నాగిరెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను 99 శాతం పూర్తి చేశారని తెలిపారు. అనంతరం రూ.6. 82 కోట్ల మెగా చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేశారు. సిఎం చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి పుల్యాల దివ్య, ఎంపిపి మండ్ల మల్లేశ్వరి, సర్పంచి పెరుమాళ్ళ శేషన్న, ఎంపిడిఒ కవి రాజు, ఎంఇఒ సుభాన్, ఈఓఆర్డి నాగేంద్రయ్య, ఏపీఎం శ్రీనివాసులు, ఏపీవో మద్దిలేటి, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి, శివానంద భారతి స్వామి, వైసిపి నాయకులు మండ్ల మురళి, వెంకట్, జబ్బార్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూపులకు వైఎస్ఆర్ ఆసరా మెగా చెక్కు అందజేస్తున్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి

# ఆళ్లగడ్డలో టిడిపి జెండా ఎగరవేస్తాం : అఖిలప్రియ

**ప్రజాశక్తి - ఆళ్లగడ్డ**

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆళ్లగడ్డలో టిడిపి జెండా ఎగరవేస్తామని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. ఆదివారం శిరివెళ్ల మండల కేంద్రంలో టిడిపి కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో డర్జీ మగ్బుల్, షేక్ వలి, షాదాక్, కొండపల్లి మొహమ్మద్, గూటల హుస్సేన్ బాషా, ఫకీర్, నూర్ బాషా, మహబూబ్ బాషా, దాదా బాష, పుల్లయ్య, రాంబాబు, చిన్న, సాయి, జాకీర్, అక్బర్ వారి అనుచర వర్గం సుమారు 180 కుటుంబాలు వైసిపి నుండి టిడిపిలోకి చేరారు. వారికి పార్టీ కండువా కప్పి టిడిపిలోకి భూమా అఖిలప్రియ, తాలూకా యువ నాయకులు భూమా విఖ్యత్ రెడ్డి, భార్గవ్ రామ్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా అఖిలప్రియ మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామన్నారు. వైసిపి అనుసరిస్తున్న విధానాలు నచ్చక నియోజకవర్గంలో అనేకమంది టిడిపిలో చేరుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికల్లో సైనికులుగా పని చేసి టిడిపి విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో టిడిపి సిరివెళ్ల మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, ఆళ్లగడ్డ కౌన్సిలర్ హుస్సేన్ బాషా, యమా గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వారితో మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

# సమిష్టిగా ఉంటేనే సమస్యలు పరిష్కారం

**- దూదేకుల సంఘం నాయకులు**

**ప్రజాశక్తి - గడివేముల**

దూదేకుల, నూర్ బాషా కులస్తులందరూ సమిష్టిగా ఉంటే సమస్యలను పరిష్కరించుకోవచ్చునని దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షుడు వాసవి దస్తగిరి, ప్రధాన కార్యదర్శి గోల్డ్ దస్తగిరి, కోశాధికారి ఉసేనప్ప, జిల్లా యూత్ అధ్యక్షుడు గబ్బర్ దస్తగిరిలు అన్నారు. ఆదివారం గడివేముల కొత్త బస్టాండ్ సమీపంలోని దూదేకుల సంఘం కార్యాలయంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 20 లక్షలకు పైగా దూదేకుల జనాభా ఉందని, దామాషా ప్రకారం చట్టసభల్లో అన్ని రాజకీయ పార్టీలు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. అధికారంలో భాగస్వామ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మైనార్టీ పదవులలో వర్గీకరణ, దామాషా ప్రకారం దూదేకులకు పదవులతో పాటు బడ్జెట్ కేటాయించాలన్నారు. ఏ రాజకీయ పార్టీ అయితే నూర్ బాషా ముస్లిం కులస్తులకు చట్టసభలలో అవకాశం కల్పిస్తుందో ఆ పార్టీకి సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలియజేశారు. అనంతరం గడివేముల మండల అధ్యక్షుడుగా మాజీ సర్పంచి చిన్న జమాల్ బాషా, వైస్ ప్రెసిడెంట్గా డాలుస్వామి, సెక్రటరీ తిరుపాడు దర్గస్వామి, ట్రెజరర్ మహబూబ్ బాషాలను ఎన్నుకున్నారు. కొత్తగా ఎన్నికైన మండల కమిటీని పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఎక్స్ ఆర్మీ జమాల్ బాషా, టీచర్ మహబూబాషా, రైస్మిల్ జమాల్ బాషా, రహీంభాష, గపూర్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీని సన్మానిస్తున్న దూదేకుల సంఘ పెద్దలు

# కొలిమిగుండ్ల ఉపసర్పంచి టిడిపిలో చేరిక

**ప్రజాశక్తి - బనగానపల్లె**

నియోజకవర్గంలోని కొలిమిగుండ్ల ఉప సర్పంచి పెద్ద నాగయ్య మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. ఆదివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో వైసిపి కీలక నేత, కొలిమిగుండ్ల పట్టణ ఉపసర్పంచ్ పెద్ద నాగయ్య ఆధ్వర్యంలో గిత్తన్న గారి నాగేశ్వరావు, కుళ్ళే నాగ కుళాయి, తలారి శ్రీనివాసులు, తలారి చెన్నకేశవ, తలారి చంద్రగోపాల్, తలారి వెంకట సుధాకర్, తలారి చెన్నయ్యతో పాటు మరో 50 కుటుంబాలు టిడిపిలో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన నాయకులకు, కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ఉపసర్పంచి పెద్ద నాగయ్య మాట్లాడుతూ కొలిమిగుండ్ల మండలం, నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే బీసీ జనార్ధన్ రెడ్డితోనే సాధ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడుని, బనగానపల్లె ఎమ్మెల్యేగా బీసీ జనార్ధన్ రెడ్డిని గెలిపించడమే ధ్యేయంగా పని చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. కలిసికట్టుగా చంద్రబాబు నాయుడుని సిఎంగా చేసుకుందామన్నారు.



మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరుతున్న ఉపసర్పంచి

# రక్తదాన కార్యక్రమ నిర్వాహకులకు ఘన సన్మానం

**- పాల్గొన్న ఎంపీ పోచా, ఎమ్మెల్యే శిల్పా**

**ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్**

ఆయుష్ యోగ కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించే స్వచ్ఛంద సంస్థల అధ్యక్ష, కార్యదర్శులకు సన్మాన కార్యక్రమాన్ని ఆయుష్ యోగ కేంద్ర నిర్వాహకులు ఆనంద్ గురూజి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డితో పాటు డాక్టర్ గెలివి సహదేవుడు, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఫణిల్ కుమార్, కౌన్సిలర్ ఖండే శ్యామ్ సుందర్ లాల్,రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి పర్ల, మేనేజింగ్ కమిటీ సభ్యులు ఉస్మాన్ బాషా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపద సమయంలో ఆదుకుని ప్రాణాపాయం నుండి కాపాడే రక్తదాతలను ప్రోత్సహించడం అభినందనీయమని ఆయుష్ యోగా కేంద్రం ఆనంద్ గురూజీ సేవలను కొనియాడారు. ఆనంద్ గురూజీ మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో ప్రతి ఒక్కరూ బిజీగా ఉంటారని, అటువంటి సందర్భంలో రక్తం దొరకడం కష్టమవుతుందన్నారు. రక్తాన్ని ఇచ్చే దాతలను ప్రోత్సహించేందుకు పలు ప్రోత్సాహకాలను ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో రెడ్క్రాస్ ఆధ్వర్యంలో దాదాపు 42 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రక్తదాన ప్రేరకులయిన సద్దాం, దాదా, బాబా, మురళి బాబు, రవితో పాటు దాదాపు 70 మందికి పైగా రక్త దాన సంఘాల వారికి ఘన సన్మానం చేశారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఫర్ సేవా అధ్యక్షుడు ఫణీంద్ర, సులోచన, టీచర్ బాపూజీ నాయక్, డా.శ్రవణ్ కుమార్, ఆయుష్ యోగ సమితి సభ్యులు, శాంతిరామ్ హాస్పిటల్ వైద్యులు సిబ్బంది, కర్నూలు, నంద్యాల రెడ్ క్రాస్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు. శాంతిరాం హాస్పిటల్ వారి సహకారంతో దాదాపు 150 మందికి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

సన్మానిస్తున్న రెడ్ క్రాస్, ఆయుష్ యోగా సిబ్బంది

టర్బో బకెట్లు పంపిణీ చేస్తున్న వెంకట సుబ్బారెడ్డి

## ఉచితంగా టర్బో బకెట్లు పంపిణీ

**ప్రజాశక్తి - కొలిమిగుండ్ల :** మండలంలోని బెలుం గ్రామ ప్రజలకు పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో అధ్యక్షులు వెంకటసుబ్బారెడ్డి టర్బో బకెట్లు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు రూ. 1 లక్ష 50 వేలతో వెయ్యి టర్బో బకెట్లను గ్రామస్తులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

## అభివృద్ధి చేసిన ఎమ్మెల్యేను ఆదరించాలి

**ప్రజాశక్తి - బనగానపల్లె**

బనగానపల్లె పట్టణంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని మరోసారి ఆదరించాలని 6వ వార్డు మెంబర్ కుమ్మరి సురేష్ బాబు ప్రజలను కోరారు. ఆదివారం పట్టణంలోని 6 వార్డులో నాయీబ్రాహ్మణ వీధి, గౌండావీధిలో వార్డు మెంబర్ కుమ్మరి సురేష్ బాబు, వైసీపీ నాయకులు ఇంటింటికి వెళ్లి ముఖ్యమంత్రి జగనన్న అందించిన సంక్షేమ పథకాలను, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్ మాట్లాడుతూ సంక్షేమం కోసం, వార్డు అభివృద్ధి కోసం ఎమ్మెల్యేగా కాటసాని రామిరెడ్డికి మరో అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు యునూస్, మాభాష, నాగేష్ ,అమీర్, ఆంసేన్ పాల్గొన్నారు.

## అరబిక్ విద్యార్థులకు పట్టాలు ప్రదానం

**ప్రజాశక్తి - వెలుగోడు**

వెలుగోడు పట్టణంలోని జామియా సిరాజుల్ ఉలూమ్ అరబిక్ కళాశాలలో హాఫీజ్, ఆలీమ్ ఖారీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు పట్టాలను అందుకున్నారు. ఆదివారం జరిగిన పట్టభద్రుల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బెంగళూరుకి చెందిన హజరత్ మౌలానా ముఫ్తి సాగీర్ అహమ్మద్ ఖాన్, అతిథులుగా హజరత్ మౌలానా పీఎం మొహమ్మద్ ముజ్జం మిల్, హజరత్ మౌలానా మొహమ్మద్ గౌస్లు హాజరయ్యారు. ఆఫీజ్, ఆలీమ్, ఖారీ కోర్సులు పూర్తి చేసిన 118 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ పట్టాలు పొందిన విద్యార్థులు మరింత ఉత్సాహంతో ఉన్నత విద్యను అభ్యసించాలని అన్నారు. అనంతరం దువా నిర్వహించారు. కార్యక్రమంలో మహబూబ్ రహమాన్, కళాశాల అధ్యాపకులు జవాద్ మౌలానా, దావూద్ మౌలానా, అస్లాం మౌలానా, మొహమ్మద్ మౌలానా, మత పెద్దలు, ముస్లిం సోదరులు భారీగా పాల్గొన్నారు.

దువా చేస్తున్న మత పెద్దలు